కలుగుతుంది. కనుక వ్యాప్యం =లింగం వ్యాపకం = సాధ్యం.

“వ్యాప్తిగలది వ్యాప్యము. ధూమము” “వ్యాప్తి నిరూపకము – వ్యాపకము – అగ్ని” వ్యాప్తి అనగా అవినాభావ సంబంధము.

అగ్నిలేకుండా ధూమం ఉండదు. అట్టి వ్యాప్తి గలది ధూమము. కనుక వహ్ని వ్యాప్యము ధూమము. ఈ వ్యాప్తికి వహ్ని నిరూపకము. అనగా వ్యాపకము.

వహ్నికి ధూమముతో అవినాభావ సంబంధము లేదు. కాలిన ఇనుపగుండులో / కాలిన బొగ్గులో అగ్ని ఉన్నా ధూమం ఉండదు. (ప్రస్తుతం గాస్ అంతే గదా!) కనుక వహ్ని ధూమవ్యాప్యము కాదు.

రూపమునకు రసము వ్యాప్యము. పృధివీజల తేజస్సులందు రూపం ఉన్నది. పృధివీ జలములందు రసమున్నది. కనుక రూపమునకు రసము వ్యాప్యము. అనగా రసమున్నచోటల్లా రూపం ఉంది. కాని రూపమున్నచోటల్లా రసం లేదు. తేజస్సులో రూపం ఉన్నది. రసంలేదు. కనుక రూపవ్యాప్యము రసము. రసవ్యాప్యం రూపం కాదు. కనుక రూపము రసమునకు వ్యభిచారి. అనగా రసాన్ని తప్పించి రూపం ఇతరత్ర ఉంటున్నది. అలాగే అగ్ని ధూమమునకు వ్యభిచారి.

**అధికదేశ వృత్తి అయినది వ్యభిచారి.** అదే వ్యాపకము. **అల్పదేశవర్తి అయినది వ్యాప్యము.** లింగము. వ్యాప్యము నందు అవినాభావ సంబంధం ఉన్నది. ధూమమునకు వహ్నితో అట్టి సంబంధం ఉన్నది.

**రెండు పదార్థములు సమానంగా ఒకేచోట ఉంటే అది పరస్పర వ్యాప్తి.** అవి పరస్పర వ్యాప్యములు. ఉదా

గంధగుణము పృధివీత్వజాతి. ఇవి కేవల పృధివి యందు తప్పక ఉంటాయి. వ్యాప్యం పృధివి, పృధివీత్వ వ్యాప్యం గంధం – అన్నమాట. అట్లే

స్నేహగుణము జలత్వజాతి. ఇది పరస్పర అవినాభావము.

ఇక, ఒకతేడా, పృథివీత్వము కంటే గంధం అల్పదేశంలో ఉంటుంది. జలత్వం, అధికదేశ వృత్తి . స్నేహం అల్పదేశవృత్తి (వృత్తి= ఉండేది)

అలాగే ప్రథమ క్షణమునందు ద్రవ్యం నిర్గుణంగా పుడ్తుంది. ద్వితీయ క్షణమునందు గుణం ఏర్పడుతుంది. ఈ లెక్కన ద్రవ్యమునకు జాతి ప్రథమ క్షణంలోనే ఉంటుంది. కాగా ఘటముయొక్క ప్రథమక్షణమున గంధం ఉండదు. పృథివీత్వం ఉంటుంది. **కనుక గంధం లేనిచోట (ఘటం) పృథివీత్వం ఉన్నట్లే. కనుక ఇది వ్యభిచారి.** గంధంతో వ్యాప్తి లేనట్లే. అలాగే జలస్నేహములు.

ఇలా పృథివీత్వ వ్యాప్యం గంధం – గంధవ్యాప్యం పృథివీత్వం కాదు.

జలత్వవ్యాప్యం – స్నేహం ; స్నేహవ్యాప్యం జలత్వం కాదు.

కనుక పరస్పర వ్యాప్యములు, పరస్పర వ్యాప్తి గలవి కనుక పరస్పర వ్యాప్యములనే అంటాము.

గంధాధికరణం = గంధవత్త్వం.

స్నేహాధికరణం = స్నేహవత్త్వం.

వ్యాప్తి నిరూపణంలో **జగదీశ భట్టాచార్యులు** ఇలా చెప్పారు. ఏ పదార్థమునందు ఏ పదార్థము కదాచిత్తుగా ఉన్నదో అది ఆ పదార్థమునకు **అధికరణము**. అనగా అవ్యాప్యవృత్తి పదార్థంయొక్క అధికరణత వ్యాప్యవృత్తిగా ఉన్నది. అవ్యాప్యవృత్తి కాదు. **అనగా వ్యాప్యవృత్తిలో అవ్యాప్య వృత్తి ఉన్నది.** అనగా పృథివిలో గంధం ఉన్నది. అధికంలో అల్పం ఉన్నది.

అవ్యాప్యవృత్తి రెండు రకాలు.

1) దేశకృత – అవ్యాప్యవృత్తి; 2) కాలకృత – అవాప్యవృత్తి

ఒక పదార్థమున కొంతమాత్రమే ఉండి మరొక భాగమున లేనిది దేశకృతా

వ్యాప్యవృత్తి. (వృక్షమున శాఖయందు కపి సంయోగం, మూలమున లేదు. సంయోగమునకు అధికరణం వృక్షపదార్థమే. కాని మూలమునందు అనగా ఏకదేశము నందు లేదు) అందువలన అవ్యాప్యవృత్తి సంయోగమునకు అధికరణం వ్యాప్యవృత్తిగానే ఉన్నది. అవ్యాప్యవృత్తి కాదు – అని సిద్ధాంతం.

2) ఒక కాలము నందుండి మరొక కాలమునందు లేకుండుట "కాలికావ్యాప్యవృత్తి" అనగా, ఇంతకుముందు చెప్పినట్లు, ద్రవ్యముయొక్క ఉత్పత్తి క్షణములో ఉండకపోవటం, తరువాత ఉండటం ద్రవ్యంయొక్క ఉత్పత్తి క్షణంలో "మధురాది" గుణములుండవు కనుక "ద్రవ్యం గుణాధికరణం కావటం" అపుడులేదు. ద్వితీయ క్షణంలో గుణం ఉంటుంది. కనుక మధురాది గుణము "కాలిక – అవ్యాప్యవృత్తి". తరువాత గంధవత్త్వ రసవత్త్వాలు పృథివీత్వ జలత్వాలతో పరస్పర వ్యాప్తిగానే ఉన్నవి. ఇది **న్యాయమతం ప్రకారం** సమాధానము.

**కాని "వేదాంత" మతమునందు నిర్గుణంగా ద్రవ్యం ఉత్పన్నం కాదు.** ప్రథమక్షణంలోగూడా అది సగుణమే. కనుక గంధరసములకు పృథివీజలత్వములు వ్యాప్యములై యున్నవి.

### 2/23) అనుమితి జ్ఞానమునకు వ్యాప్తిజ్ఞానం అవసరం

ప్రత్యక్షంగాగాని, శబ్దంగాగాని కలిగే వ్యాప్తిజ్ఞానం వలననే పర్వతాదులయందు అనుమితి రూపమయిన జ్ఞానం కలుగుతుంది. రసము రూపవ్యాప్యమని, ధూమము వహ్ని వ్యాప్యమని స్మరించిన వానికి ఆయా అనుమితులు గలుగును. వ్యాప్తికి వ్యాప్యత్వం అనిపేరు. వ్యాప్తిజ్ఞానము లేనివానికి అనుమితి కలుగదు. కనుక వ్యాప్తిజ్ఞానం (అవినాభావ సంబంధము) అనుమితికి కరణం అయి యున్నది.

వ్యాప్తిజ్ఞానం – అది సందేహాత్మకంగా ఉంటే అనుమితిని కలిగించలేదు.

ధూమం వహ్నికి వ్యాప్యము కాదా? అన్న సందేహం ఉన్నవాడు ధూమం

చూచి పర్వతంమీద "అగ్ని" ఉంటుందని నిశ్చయించలేడు. కనుక అనుమితి సందిగ్ధమే. కనుక వ్యాప్తి నిశ్చయము అనుమితికి కారణము.

ఈ వ్యాప్తి నిశ్చయమునకు కారణము వ్యాప్య వ్యాపకముల సాహచర్యం. ధూమాగ్నుల సాహచర్యం. అది మహానసాదులలో గమనించిన వానికి తెలుస్తున్నది. కనుక ధూమమునకు వహ్ని సాహచర్యము నిశ్చయము. కనుక వ్యాప్తి లేని వహ్నికి ధూమ సాహచర్యము నిశ్చితం కాదు. వ్యభిచారము. అందువలన వహ్నికి ధూమంతో వ్యాప్తిలేదు. కనుక ధూమం వహ్ని వ్యాప్యం. వహ్ని ధూమ వ్యాప్యం కాదు.

(సాహచర్యం = సహచారం = కలిసి యుండటం. వ్యభిచారము వదలి యుండుట.) అయితే జలమునందున్న ధూమముతో వహ్ని కనబడదు. (అనగా నిప్పును ఆర్పినపుడు) అలాగే నిప్పు ఆరినపుడు పైకిపోవు పొగవద్ద గూడా అగ్ని ఉండదు. అయినా మూలము తెగని పొగకు మూలమునందు అగ్ని ప్రత్యక్షముగా ఉండి ఉంటుంది. కనుక "ధూమ – అగ్నుల" మధ్య వ్యాప్తి నిశ్చయము కలుగును. దానివలన సంస్కారము ఏర్పడును. అందుచేత పర్వత ధూమమును చూచి "పర్వతోవహ్నిమాన్" అని అనుమితి కలుగును.

### 3/24) సకలనైయాయికుల – అనుమితి క్రమము

1) హేతుసాధ్యములయిన ధూమవహ్నులయొక్క సాహచర్యం మహానసాదుల యందు తెలుస్తుంది. తర్వాత పర్వతాదులయందు ధూమాది హేతువు కనబడినపుడు పాతసంస్కారం స్ఫురిస్తుంది. 'వ్యాప్తి' గుర్తుకు వస్తుంది. అపుడు "సాధ్యవ్యాప్తి విశిష్ట హేతువు" అనగా వహ్ని వ్యాప్తి విశిష్ట హేతువయిన ధూమం పక్షమునందు (పర్వతం) ప్రత్యక్షం అవుతుంది. దానిని పరామర్శ అంటారు. అదే

''పర్వతము వహ్నివ్యాప్యమయిన ధూమం కలది'' (వహ్ని వ్యాప్యధూమవాన్పర్వతః)

అనగా "సాధ్యవ్యాప్య హేతుమాన్ పక్షః" అన్నది అన్ని పరామర్శలకు సామాన్య లక్షణము. చివరకు తేలిన సారాంశము.

"వహ్నిమాన్ పర్వతః" అనుమితి.

ప్రాచీనమతమున అనుమితికరణము పరామర్శ. మరియును సకలజ్ఞానం అన్యథా సిద్ధమయినది. వారి మతమున పరామర్శమే అనుమానము. **"అనుమితి కరణమనుమానమ్"** అని లక్షణము.

పరామర్శమునకు వ్యాపారములేదు. వ్యాపారంలేనిది కరణం కారాదు. అయినా ఈ మతంలో వ్యాపార హీనమయిన కారణమే. 'కరణం' అంటారు. అందువలన పరామర్శయే అనుమితికరణం= అనుమానము. కొందరు జ్ఞానహేతువును అనుమానం అంటారు. మరికొందరు హేతుజ్ఞానమును అనుమానం అంటారు. మరికొందరు 'కరణం' అంటారు.

వ్యాప్తి స్మరణము పరామర్శమని,

ఈ పరామర్శ జ్ఞానమును అనుమాన మంటారు. పరామర్శమునే వ్యాపారమని కొందరంటారు. **ఇలా న్యాయమతంలో అనేక పక్షాలున్నాయి.** మొత్తంమీద 'పరామర్శ' మాత్రం సర్వసమ్మతం. అది లేనిదే అనుమితి కలగదు. ఇది సకల నైయాయిక మతము.

## 4/25 అనుమితి - మీమాంసక దృష్టి

ఎ) పరామర్శ అవసరంలేదు. ధూమం చూడగనే వ్యాప్తి గుర్తు వస్తుంది. వహ్నిని అనుమితి చేస్తాం. అంతే.

బి) పరామర్శ తరువాత అనుమితి కలిగిన చోటనయినా అది అనుమితికి కారణము కాదు.

సి) పరామర్శ అన్యథా సిద్ధం. అది లేకున్నా పనిజరుగుతుంది. ఉదా॥ ఘటనిర్మాణంలో 'గాడిద' (మట్టిని మోసేది) అన్యథా సిద్ధము– కరణ సామగ్రి

కంటే భిన్నమయిన వస్తువులు అన్యథా సిద్ధములు. గాడిద లేకపోయినా మట్టి తేవచ్చు గదా!

కనుక వీరిమతమునందు పరామర్శము అనుమితి కారణం కాదు. వేరే వాటిని అనుమానం (పరామర్శం) అని చెప్పారు.

వ్యాప్తి స్థితిని, వ్యాప్తి – అనుభవమును, పక్షమునందు హేతుజ్ఞానమును అనుమానమని కొందరు భావిస్తున్నారు.

**5/26 అద్వైతములు – అనుమితి క్రమము**

ఎ) చాలవరకు వీరు మీమాంసక విధానాన్ని పాటిస్తారు. వీరి మతములోనూ పరామర్శం అనుమితి కారణం కాదు. మహానసాదులలో గమనించిన వ్యాప్తిజ్ఞానమే (అనుభవం) అనుమితికి కారణం. (సంస్కారమే దీనివ్యాపారం) (వ్యవహారే భాట్టనయః– అని కదా)

బి) వ్యాప్తి – అనుభవం వలన వచ్చిన సంస్కారం వ్యాపారము.

సి) ధూమాది హేతుప్రత్యక్షమే సంస్కారమునకు కారణము (ఉద్బోధకం).

డి) వ్యాప్తి స్మరణంవద్ద స్మృతి గూడా పుట్టినది కనుక సంస్కారము నశించదు. అందువలన వ్యాప్తి స్మరణం జరిగినచోట నల్లా 'స్మృతి, సంస్కారం' ఉంటాయి.

ఇ) అనుమితి "వ్యాపారరూప" కారణము. సంస్కారమే వ్యాప్తి స్మృతి కాదు.

ఎఫ్) వ్యాప్తి స్మృతిని అట్టి కారణమని అంగీకరించినా స్మృతి కారణము సంస్కారమని చెప్పక తప్పదు. అపుడు స్మృతిగూడా అనుమితి కారణమని చెప్పవలసి వస్తుంది. అందువలన అనుమితికి కారణాలు రెండవుతాయి.

1) స్మృతి; 2) సంస్కారము.

ఇది అనవసర భారము. అందువలన స్మృతి కారణమయిన సంస్కారమునే అనుమితి కారణంగా అంగీకరిస్తే కారణద్వయభారం పోతుంది. లాఘవం

వస్తుంది. కాగా వ్యాప్త్యనుభవం – కరణం.

సంస్కారం దాని వ్యాపారం, అనుమితి ఫలం. **వేదాంత పరిభాషాది గ్రంథవైఖరి ఇది.**

### 6/27 "వాప్తి స్మృతియే వ్యాపారం, సంస్కారం" కాదు

కాని స్మృతి మాత్రమే వ్యాపారం అన్నా, ఇబ్బంది లేదు. అయితే **"వేదాంత పరిభాష"** మొదలగు గ్రంథములతో విరోధం వస్తుంది. అయినా యుక్తికి ఆధునిక వేదాంత గ్రంథములకు అనుకూలమే.

అనుమితికి వ్యాపార రూపమయిన వ్యాప్తి స్మృతియే కారణము. లేదా వ్యాపార రూపమయిన వ్యాప్తి సంస్కారమే కారణము – అన్నా తప్పులేదు. శ్రుతి స్మృతి విరోధం లేదు. వ్యాప్తి స్మృతిని వ్యాపారమని చెప్పినా విరోధములేదు. అది యుక్తి యుక్తము గూడా.

వ్యాప్తి సంస్కారము అనుమితికి కారణమంటే,

ఎ) సంస్కారం మేల్కొనకుండానే అనుమితి అవుతుందా? అలా అయితే సంస్కారం ఎపుడూ ఉండేది కనుక ధూమం కనబడకపోయినా "పర్వతో వహ్నిమాన్" అనే అనుమితి వస్తుందనాలి.

బి) అందువలన, సంస్కారం మేల్కొన వలసినదే. అదే అనుమితి హేతువు. పైగా మేల్కొన్న సంస్కారం లేకుండా "స్మృతి" గూడా రాదు గదా! ధూమం కనబడకుండా వ్యాప్తి స్మృతి ఎలా పుడ్తుంది? పైగా అనుమితికి స్మృతికి ఒక్కటే సామగ్రి (వ్యాప్తి సంస్కారము). మరి దానివలన అనుమితి వస్తుందా? స్మృతి వస్తుందా? వీటిమధ్య ఒకటి మరొకదానిని అడ్డగిస్తుందంటారా? ఏది దేనినడ్డగిస్తుంది? తెలియదు. కనుక వినిగమనావిరహం. రెండు చెప్పడం మరల అందులో ఒకదానిని ఒకటి అడ్డగించటం – ఇదంతా భారమయిన కల్పన. ఇంతకు ఇదంతా అనుభవంలోలేనిది, విరుద్ధం.

అనుభవం ఏమంటే, పర్వతంమీద ధూమం చూస్తాం. వెంటనే వహ్ని

వ్యాప్తి గుర్తువస్తుంది. అపుడు పర్వతముపైన అగ్ని ఉందని అనుమితి కలుగుతుంది.

ఇందులో అనుమితి వలన వ్యాప్తి స్మృతి ఆగిపోలేదు. ముందు వ్యాప్తి స్మృతి తరువాత అనుమితి పుట్టాయి. తరువాత పుట్టిన అనుమితి ముందు పుట్టిన వ్యాప్తి స్మృతిని ఎలా అడ్డుకొంటుంది? పైగా సామగ్రి ఒకటి అయినపుడు విరోధం లేనపుడు **'ప్రతిబధ్య ప్రతిబంధక భావం'** ఎలా కలుగుతుంది? (వ్యాప్తి అనుమితికి ప్రతిబంధకమయితే ఇక ఎక్కడా అనుమితి పుట్టదు. వ్యాప్తి స్మృతి నిష్ఫలం)

**టీకా సహితమయిన వేదాంత పరిభాషయందు** (ధర్మరాజకృతం) ఇలా ఉన్నది. "ధూమదర్శనం వలన వ్యాప్తి సంస్కారం కలుగుతుంది. దానివలన ఒకపుడు వ్యాప్తి స్మృతి కలుగవచ్చును. కలుగకపోవచ్చును. సంస్కారము వలన ఇచ్చట స్మృతి పుట్టినా సంస్కారం పోదు. కనుక సంస్కారం స్మృతి రెండూ ఉంటాయి. అయితే స్మృతితో నిమిత్తం లేకుండా సంస్కారము వ్యాపారమయి అనుమితిని కలిగించును. అందువలన స్మృతి వ్యాపారము కాదు.' – ఇది ధర్మరాజు వ్రాసిన వాక్యము.

**విచారణ :**

సంస్కారము మేల్కొనినపుడు "స్మృతి" ఉండకపోవడం ఎలా? ఉండి తీరుతుంది. స్మృతి పుట్టిన తరువాత సంస్కారం (నిష్ఫలం కనుక) నశిస్తుంది. అపుడు **స్మృతివలన మరో సంస్కారం కలుగుతుంది. ఇది సరయిన పక్షము.** దీనిప్రకారము స్మృతి సంస్కారములు రెండూ కలిసి కారణం అనటం విరుద్ధమే. కనుక

వ్యాప్తిజ్ఞానము – కరణము

వ్యాప్తి స్మృతి – వ్యాపారము. అనటం సరయిన మార్గము.

**7/28) స్వార్థానుమితి**

తనకు పరిమితమయిన అనుమితి. తాను పర్వత ధూమమును చూచి "పర్వతం"పై అగ్ని ఉన్నది, అని ఊహించటం స్వార్థానుమానం.

న్యాయమతంలో (ముందు చెప్పినట్లు)

ఎ) ధూమప్రత్యక్షము (ధూమాత్)

బి) వ్యాప్తి స్మరణము (యత్రధూమః తత్రఅగ్నిః)

సి) పరామర్శ (వహ్నివ్యాప్య ధూమవాన్ పర్వతః)

డి) అనుమితి (పర్వతోవహ్నిమాన్)

ఇది వరస. వీరికి 'పరామర్శ' అదనం. ఈ పరామర్శను వేదాంతులు మీమాంసకులు వదలారు. పంచావయవ వాక్యప్రయోగం లేకుండానే కలిగే సొంత అనుమితి. 'స్వార్థానుమితి' దీనికి కరణమయిన వ్యాప్తిజ్ఞానము స్వార్థానుమానము.

**8/29) పరార్థానుమితి - తర్కము**

అనుమితి విషయంలో సందేహం కలిగినపుడు, నిశ్చయం గలవాడు అతనికి నిరూపణగా చెప్పే వాక్యప్రయోగము 'పరార్థానుమానము". ఇది న్యాయమత ప్రకారం ఇలా ఉంటుంది. ఇది **పంచావయవ వాక్యం.**

ఎ) పర్వతోవహ్నిమాన్ - ప్రతిజ్ఞ

బి) ధూమవత్త్వాత్ - హేతువు.

సి) యోయోధూమవాన్<br>సనవహ్నిమాన్<br>యధామహానసః ] = ఉదాహరణం

డి) తధాచాయం - ఉపనయః

ఇ) తస్మాత్తధా - నిగమనం. ఇలా 5 అవయవాలు.

కాని వేదాంతులు మూడు అవయవాలు గల వాక్య ప్రయోగం

అంగీకరించారు.

1) పర్వతో వహ్నిమాన్ – ప్రతిజ్ఞ

2) ధూమాత్ – హేతువు

3) యోయోధూమవాన్ సనోగ్నిమాన్, యధామహానసః – ఉదాహరణం.

ఎ) ప్రతిజ్ఞ అనగా సాధ్యముతో గూడిన పక్షమును చెప్పును. సాధ్యం వహ్ని – పక్షం పర్వతం.

'పర్వతో వహ్నిమాన్' ఈ ప్రతిజ్ఞలో పర్వతం గూడా సాధ్యభాగంలో ఉన్నది. గనుక సాధ్యమనవలెను. అయినా వేదాంత మతమునందు ఆ మొత్తం ప్రతిజ్ఞ ఏకజ్ఞానం. అయినా పర్వతాంశం – ఇంద్రియ ప్రత్యక్షం.

వహ్ని – అంశం – ధూమజ్ఞాన రూపమయిన అనుమానం.

ప్రత్యక్షత, అనుమితిత అని రెండు ధర్మములు ఒకే వాక్యమున ఉన్నాయి.

పక్షము – సాధ్యం (ధూమం) కలిగినది పక్షం (పర్వతం).

బి) హేతువు – ఇది ధూమాది లింగమును బోధించును. అదే "ధూమాత్"

సి) ఉదాహరణ వాక్యము – ఉభయులకు వివాదములేని దృష్టాంతము.

ఈ మూడు అవయవములుగల మహావాక్యముచేత సంశయంగల వాని సంశయం తొలగుతుంది.

**తర్కము** – ఇంత చెప్పినను ప్రతివాడికి ఇది నిశ్చితము కాదు, పర్వతమునందు ధూమమే ఉన్నది, వహ్ని లేకపోవచ్చు అని వ్యభిచార శంక కలిగినచో "తర్కం" వలన ఆ శంకను తొలగించవచ్చును.

తర్కము అనగా "అనిష్టా పాదనము". "ఇద్దరికి ఇష్టముకాని విషయముతో బెదురుపెట్టి ఒప్పించటం" ఉదా.

"ధూమమున్నా వహ్ని లేదంటే వహ్నిధూమముల మధ్య కార్యకారణభావము లేదంటాము" అని అనాలి. కార్య కారణభావం లేదనలేము గదా! కనుక ఈ అనిష్టమును తప్పించుటకు ప్రతివాది తప్పక ధూమంవలన 'వహ్ని' ఉన్నదన్న

విషయం అంగీకరించాలి.

ఈ విధముగా పరార్థానుమాన మున్నది. దీనివలన వచ్చు అనుమితి **పరార్థానుమితి**. దీనికి 'తర్కం' సహకారి. (వ్యాప్యారోపేణ వ్యాపకారోపః తర్కః)

## 9/30) వేదాంతమతంలో తర్కసహిత పరార్థానుమానము

"వేదాంత వాక్యము"లో "జీవునియందు బ్రహ్మాభేదం" చెప్పబడినది. **"జీవో బ్రహ్మాభిన్నః"** – ప్రతిజ్ఞ.

'చేతనత్వాత్ – హేతువు. (చైతన్యంగలవాడు గనుక)

"యత్ర యత్ర చేతనత్వం తత్రతత్ర బ్రహ్మాభేదః యధాబ్రహ్మణి" – ఉదాహరణ

ఈ అవయవత్రయ సహిత వాక్యము పరార్థానుమానము. ఇందులో

జీవుడు – పక్షము.

బ్రహ్మాభేదం – సాధ్యము.

చేతనత్వం – హేతువు

బ్రహ్మం – దృష్టాంతము

ప్రతివాది శంక "ఈ అభేదం కుదరదు – ఈ హేతువు సరికాదు. దీనికి సమాధానంగా తర్కము పెట్టాము. 'చేతనం అద్వితీయం' అనుశ్రుతి తప్పు" అని అంటాము. శ్రుతిని తప్పనటం వాది ప్రతివాదుల కిష్టంకానిది. కనుక ప్రతివాది బ్రహ్మాభేదమును శంకింపడు. అంగీకరిస్తాడు. అలాగే

"వ్యావహారిక ప్రపంచము మిధ్య" = ప్రతిజ్ఞ. జ్ఞానంతో తొలగుతున్నది గనుక – హేతువు. ఏది ఏది జ్ఞానంతో తొలగుతుందో అది మిధ్య – శుక్తిరజతంలో లాగా – ఉదాహరణ.

ఇలా చెప్పినా ప్రతివాది శంకిస్తాడు. మిధ్యాత్వమును అంగీకరించడు. సమాధానంగా తర్కం చేయాలి. మిధ్యాత్వం అంగీకరించకపోతే అది సత్య

పదార్థం అనాలి. అది తొలగటం జరగదు. కనుక సకలప్రపంచం జ్ఞానంతో బాధింపబడుతుందని శ్రుతి స్మృతులు చెప్పాయి – అది అబద్ధం అందాము – అని అంటారు. వాటిని అబద్ధం అనటం ఉభయులకు అనిష్టం. కనుక 'ప్రతివాది', శంకను వదలుకొంటాడు.

## 10/31) వేదాంతంలో అనుమాన ప్రయోజనము

స్వతంత్రానుమానము వేదాంతములో కుదరదు. అది "బ్రహ్మనిశ్చయం" చేయజాలదు. కనుక శ్రుతికి అనుకూలంగా అనేక అనుమానాలు వాడబడుతాయి. అవి అన్నియు శ్రుతిచెప్పిన "బ్రహ్మవిషయం" సంభవమని అర్థం చేసికొనటానికి అవసరం.

ద్వితీయ ప్రకాశం సమాప్తం

– o –